

కోట్‌పల్లి మండలం మోత్కుపల్లిలో రోడ్డు



వరద నీరు నిలిచి బురదమయంగా మారిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మను చౌదరి

దశల వారీగా సమస్యల పరిష్కారం

» మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

కీసర రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): దశల వారీగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానికులు గత సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. గురువారం కలెక్టర్ డబుల్ బెడ్ రూం ఇళ్లను సందర్శించారు. పలు బ్లాకుల్లో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. లిఫ్టు మరమ్మతులు చేయిస్తామని, సెల్లార్లలో నీరు నిల్వకుండా చూస్తామన్నారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా 41 బ్లాకులకు కలిపి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తామన్నారు. చెత్తను వెనువెంటనే తొలగించేలా మున్సిపల్ అధికారులకు సూచిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ అధికారి రమణమూర్తి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి ఉన్నారు.

మహేందర్ రెడ్డితో హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు



భక్తిభావంతో ఉత్సవాలు జరుపుకోవాలి

» ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి

తాండూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలు శాంతియుతంగా భక్తిభావంతో జరుపుకోవాలని ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు మహేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్నప్పుడు కేటాయించిన స్థలానికి ప్రహరీకి, ఇతర అభివృద్ధి కార్యక్రమాల కోసం నిధులు అందిస్తానని హామీ ఇచ్చారు. సంప్రదాయలను అందరూ గౌరవించాలని, ఎలాంటి గొడవలు లేకుండా ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, కోశాధికారి రోంపల్లి సంతోష్‌కుమార్, సంఘం ప్రతినిధులు పర్యాద రామకృష్ణ, వెంకట్, తదితరులు ఉన్నారు.

రోడ్లు ఛిద్రం

భారీ వర్షాలకు ఆగమాగం

ఉమ్మడి జిల్లాలో రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అడుగుకో గుంత.. గజానికో గొయ్యి ఏర్పడి వాహనదారులు నరకం చూస్తున్నారు. గ్రామీణ, మున్సిపాలిటీ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎక్కడ చూసినా కంకర తేలి, గుంతలు పడి, వర్షం నీరు నిలిచి బురదమయంగా మారాయి. వాహన దారులను అప్రమత్తం చేసేందుకు భారీ గోతులు ఉన్న చోట స్థానికులు రాళ్లు, చెట్ల కొమ్మలను అడ్డుగా ఉంచుతున్నారు. ఛిద్రమైన రోడ్ల మరమ్మతులకు నోచుకోవడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.



అధ్వానంగా నవాబుపేట మండలం ఏక్‌మామిడి రోడ్డు



మోమిన్‌పేట నుంచి శంకర్‌పల్లి రోడ్డు



దోమ మండలం పాలేపల్లి - అయినాపూర్ బీటీ రోడ్డు

ఉమ్మడి జిల్లాలో రోడ్లు గుంతలమయం

- బురదతో ముందుకు సాగని ప్రయాణం
- ఇబ్బందుల్లో వాహనదారులు
- జాతీయ రహదారిపై పరిస్థితి మరింత దారుణం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

వికారాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత 15 రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వానలు దంచికొడుతుండటంతో రోడ్లన్నీ ధ్వంసమై చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. బురద నీటిలో రాకపోకలు సాగిస్తూ వాహనదారులు నరకం చూస్తున్నారు. తారు, కంకర లేచి భారీ గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాల తాకిడికి కొన్నిచోట్ల గోతులు పెద్దవిగా మారాయి.

గుంతలను తప్పించే యత్నంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరికొందరు గోతులను గమనించక అదుపుతప్పి కిందపడిపోతున్నారు. రంగారెడ్డి జిల్లా- వికారాబాద్ జిల్లాలకు అనుసంధానంగా ఉన్న శంకర్‌పల్లి వయా మోమిన్‌పేట్ రోడ్డు దారుణంగా తయారైంది. ఈ రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డును చేవెళ్ల, వికారాబాద్ ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల మండల కేంద్రంలో

మిగతా 7వ పేజీలో...

వికారాబాద్ జిల్లాలో

వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం, మోత్కుపల్లి గ్రామం నుంచి వికారాబాద్ వెళ్లే రోడ్డు బురదయంగా మారింది. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం ఏక్‌మామిడి రోడ్డుపై వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అడుగుకో గుంత వాహనదారుల చింతగా మారింది. దోమ మండలం పాలేపల్లి-అయినాపూర్ వెళ్లే బీటీ రోడ్డు గుంతలు ఏర్పడటంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడికి ప్రయాణించాలన్నా.. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సంబంధిత శాఖ అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, రీబీటీకి నిధులు మంజూరు చేసి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

రీ-బీటీకి నిధులు మంజూరు చేయాలి



మా గ్రామం నుంచి ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. మాజీ ఎమ్మెల్యే మస్కు నర్సింహ హయంలో వేసిన బీటీ రోడ్డు పూర్తిగా పాడైంది. కొత్త రోడ్డుకు నోచుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులకు ఎన్నో వినతులు చేశాం. తర్వరగా బీటీ రోడ్డు వేయాలి.

- గీతేశ్వరి, కొలన్‌గూడ మాజీ సర్పంచ్, కందుకూరు మండలం

పల్లె మురిసేలా..

నేటి నుంచి 'పనుల జాతర'

- అభివృద్ధి, ఆస్తుల కల్పనే లక్ష్యం
- జిల్లాలో రూ.23.13 కోట్లతో 1,363 పనులు
- కార్యాచరణ రూపొందించిన జిల్లా యంత్రాంగం



వికారాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పల్లెల్లో పనుల జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపాధి కల్పన, పల్లెల్లో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టింది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అంకితభావంతో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో పల్లెల్లో పనుల జాతర నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు స్పీకర్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో చేపట్టాల్సిన పనులపై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాచరణ రూపొందించింది. ప్రభుత్వం ఆమోదించిన పనులను ఈనెల 22 నుంచి గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు ప్రారంభించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్వచ్ఛభారత్ మిషన్(గ్రామీణ), ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల సమన్వయంతో 'పనుల జాతర - 2025' పేరుతో పనులు చేపట్టనున్నారు. కొత్త గ్రామ పంచాయతీ,

మిగతా 8వ పేజీలో...

కూలీలకు ఉపాధి కల్పనే ధ్యేయం

ఉపాధి కూలీలకు అధిక పనులతో జీవనోపాధి కల్పించాలన్న ధ్యేయంతో కార్యాచరణ రూపొందించారు. చేపట్టిన పనుల పురోగతికి సంబంధించి ఎప్పటికప్పుడు ప్రగతి నివేదికలు అందజేయనున్నారు. చేపడుతున్న పనులు క్షేత్ర స్థాయిలో ఏ దశల్లో కొనసాగుతున్నాయనేది తెలియజేసేందుకు డీఆర్‌డీవో, ఎంపీడీవోలకు తాజా ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



వంటలను పరిశీలిస్తున్న జాకీర్ అహ్మద్

డెంగీ కేసులతో అప్రమత్తం

వికారాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇప్పటివరకు వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ కేసులతో ఇబ్బంది పడ్డ జనం ప్రస్తుతం డెంగీ కేసులు కలవరపెడుతున్నాయి. ఇటీవల వికారాబాద్ పట్టణంలో మూడు డెంగీ కేసులు నమోదు కావడంతో మున్సిపల్ అధికారులు అప్రమత్తమయ్యారు. పట్టణంలోని శివారెడ్డిపేట, వెంకటేశ్వర కాలనీతోపాటు కొత్తగడిలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ సందర్శించి పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. వేడి ఆహార పదార్థాలనే తినాలన్నారు.

జిల్లాలో రేపు

జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక

కులకచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పరిగి జోనల్ స్థాయి అండర్-14, 17 బాల బాలికల వాలీబాల్ టోర్నమెంట్, జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపికను శనివారం కులకచర్ల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు పీడీ ప్రవీణ్‌కుమార్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. పరిగి జోనల్ సెక్రటరీ ఎండీ ఖాజా ఆధ్వర్యంలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడల ముగింపు కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8187891301, 9948640187 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శనైశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మోమిన్‌పేట్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శని అమావాస్యను పురస్కరించుకొని శనివారం మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల శ్రీ శంకర భారతి ఆశ్రమంలో వెలిసిన శ్రీ శనైశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఏటా శ్రావణమాసంలో అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. పూజల్లో పాల్గొనే భక్తులకు అన్నీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రాస్నం అడవిలో ఆక్రమణలు

- » అడ్డుకుంటున్న అధికారి బదిలీకి యత్నం!
- » రేపోమాపో ఉత్తర్వులు జారీచేసేలా రాజకీయం



రాస్నం రిజర్వ్ ఫారెస్టులో అక్రమంగా వేసిన రోడ్డు (ఫైల్)

ధారూరు, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి): ధారూరు అటవీ రేంజ్‌లో ఆక్రమణలకు అడ్డుగా ఉన్న ఓ అటవీ అధికారిని బదిలీ చేయించేందుకు అక్రమార్కులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. తాండురు నియోజకవర్గంలోని అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడు అధికారిపై తప్పుడు ఫిర్యాదులు చేసి ఇక్కడి నుంచి తప్పించాలని రాజకీయంగా అటవీశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. రేపోమాపో ఈ అధికారిని ఇక్కడి నుంచి బదిలీ చేసేందుకు అటవీశాఖ ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. ధారూరు అటవీ రేంజర్‌గా రాజేందర్ గతేడాది ఆగస్టులో ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చి రాగానే ధారూరు అటవీ బీట్‌లోని ఏడు ఖానాల వద్ద ఆక్రమించిన 25 ఎకరాల అటవీ భూమిని స్వాధీనం చేసుకుని 11,110 మొక్కలు నాటి ప్లాంటేషన్ చేశారు. అదేవిధంగా రాస్నం, దోర్నాల్, జుంటుపల్లి రిజర్వు ఫారెస్టులో ఆక్రమణకు గురవుతున్న అటవీ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఇందులోభాగంగా రాస్నంకు చెందిన అధికార పార్టీ నాయకుడు తన పొలానికి దారి కోసం అటవీ ప్రాంతంలో జేసీబీతో చదును చూసి రోడ్డు వేశాడు. సమాచారం అందుకున్న రేంజర్ సిబ్బందితో వెళ్లి రోడ్డును తవ్వి అడ్డుకున్నారు. రాస్నంతోపాటు జుంటుపల్లి అటవీ ప్రాంతంలో అక్రమార్కులు యథేచ్ఛగా అటవీ భూములను కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నారు. ఈ ఆక్రమణలను అడ్డుకుంటున్న రేంజర్ రాజేందర్‌ను తప్పిస్తేనే తమ ఆటలు సాగుతాయని ఆక్రమణదారులు రేంజర్‌పై తప్పుడు ఫిర్యాదులు చేసి ఆయన బదిలీకి అటవీశాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు వినికిడి. రేంజ్‌లో జరుగుతున్న ఆక్రమణల గురించి ఉన్నతాధికారులకు తెలిసినా రాజకీయ ఒత్తిడిల కారణంగా అక్రమాలను చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. నిక్కచ్చిగా పనిచేస్తూ అడవిలో ఆక్రమణలను అడ్డుకుంటున్న రేంజర్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేసేందుకు ఉన్నతాధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే అడవి అక్రమార్కుల పాలవ్వటం ఖాయమనే ప్రచారం సాగుతోంది.

మహేశ్‌కుమార్ రీసెర్చ్ అభినందనీయం

» జిల్లా వైద్యాధికారి లలితాదేవి

వికారాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రామ్ అధికారిగా పని చేస్తున్న డాక్టర్ మహేశ్‌కుమార్ పిల్లల దత్తత, కుటుంబ ఇంటిగ్రేషన్‌పై రీసెర్చ్ చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో డాక్టర్ మహేష్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇదెక్కడి చోద్యం!

- బిల్లులు రాలేదని పిల్లలకు నోఎంట్రీ
- అంగన్‌వాడీ వద్ద మాజీ సర్పంచ్ అడ్డగింత
- పూడూరులోని మేడికొండలో ఘటన

8

స్థల సేకరణను త్వరగా పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, అధికారులు

మేడ్చల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి స్థల సేకరణ త్వరితగతిన పూర్తిచేయాలని హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ మేడ్చల్ జిల్లా అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్-శామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి చేపట్టిన స్థల సేకరణ పురోగతిపై గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. స్థల సేకరణలో స్థలాలు, ఇళ్లు కోల్పోతున్న వారికి నిబంధనల మేరకు పరిహారం చెల్లించాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సూచించారు. అల్వాల్‌లోని సత్యా అపార్ట్‌మెంట్ వారికి జరిగే నష్టంపై అంచనా వేయాలని, శామీర్‌పేటలో తొలగించనున్న సాయిబాబా ఆలయానికి మరో చోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఎలివేటర్ కారిడార్‌కు స్థల సేకరణ వివరాలను కమిషనర్‌కు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి, అల్వాల్, శామీర్‌పేటల తహసీల్దార్లు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు

వికారాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మందికి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి లభించింది. జిల్లాలో 30 జీహెచ్‌ఎం పోస్టులు ఖాళీ ఉండగా, వాటిలో 8 పోస్టులు జిల్లాలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించారు. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న 22 మందికి జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించి వికారాబాద్ జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. దోమ మండలం దిర్సంపల్లిలో పనిచేసిన రూప్‌సింగ్‌కు అదే పాఠశాలలో జీహెచ్‌ఎంగా పోస్టింగ్ లభించింది. వికారాబాద్‌లో పనిచేసిన జాక వెంకటేశంను కొడంగల్ జెడ్పీ బాలుర పాఠశాలకు కేటాయించారు. దోమ మండలం, కిష్టాపూర్‌లో పనిచేసిన ఆర్.మహేంద్ర బహదూర్‌కు పుట్టపహాడ్ ఉన్నత పాఠశాల, పరిగి మండలం, ఖుదావందపూర్ యూపీఎస్‌లో పనిచేసిన కె.కరుణాకర్‌కు దేవనూర్ ఉన్నత పాఠశాలలో జీహెచ్‌ఎంలుగా పోస్టింగ్ లభించింది. ఆలంపల్లిలో పనిచేసిన డి.వెంకటయ్యకు మైల్వార్ ఉన్నత పాఠశాల, పరిగి మండలంలో పనిచేసిన విజయకుమార్‌కు దోమ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల కేటాయించారు. మదన్‌పల్లిలో పనిచేసిన జి.హేమలతకు కరణ్‌కోట్, చిట్టిగిద్దలో పనిచేసిన టి.మహేశ్వర్‌రెడ్డికి ధారూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో జీహెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగులు ఇస్తూ పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పోచారం మున్సిపల్ కమిషనర్‌గా నిత్యానంద్

ఘట్‌కేసర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ కమిషనర్‌గా ఎస్.నిత్యానంద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఎల్లంపేట్ నుంచి పోచారానికి బదిలీపై వచ్చాడు. ఇప్పటి వరకు ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన వీరారెడ్డి సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషర్‌కు స్వాగతం, బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు మున్సిపల్ ఉద్యోగులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీఈ మహిపాల్, మేనేజర్ అశోక్ సిబ్బంది పాల్గొన్నారు.


కమిషనర్ నిత్యానంద్‌కు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న మేనేజర్

గణేశ్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి


కందుకూరులో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ జానకీరెడ్డి

కందుకూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని మహేశ్వరం ఏసీపీ కె.జానకీరెడ్డి అన్నారు. గురువారం కొత్తగూడలోని ఎంఎంఆర్ బాంక్వెట్ హాల్‌లో పీస్ కమిటీ సమావేశంలో తహసీల్దార్ కె.గోపాల్, సీఐ సీతారాం, ఎంపీడీవో సరితలతో కలిసి మాట్లాడారు. 27న జరుపుకునే వినాయక చవితి నుంచి నవరాత్రులకు మండలంలో ఏర్పాటు చేయనున్న మండపాలకు అధికారుల అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాల వద్ద రాత్రి 10గంటలకల్లా సాంస్కృతిక కార్యక్రమాలను నిలిపివేయాలన్నారు. అన్న ప్రసాదాలు, పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలన్నారు. డీజేలు పెట్టొద్దన్నారు. నిమజ్జనాల్లో అల్లర్లు జరుగకుండా మండపాల కమిటీలు శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవి, ఎస్సైలు పరమేశ్, వెంకటేశ్, ఏఎస్‌ఐ బలరామరాజు, సాధ మల్లారెడ్డి, ఎకుమార్, సులేమాన్, అఫ్జల్‌బేగ్, జగదీశ్, బి.బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలి

కీసర రూరల్: గణపతి ఉత్సవాలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి అన్నారు. గురువారం నాగారంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చవితి ఉత్సవాలపై నాగారం, దమ్మాయిగూడ పరిధి మండప నిర్వాహకులు, అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. తక్కువ ఎత్తున్న విగ్రహాలను ప్రతిష్ఠించుకుంటే అధిక శాతం ప్రమాదాలను నివారించుకోవచ్చన్నారు. కాలనీల్లో రోడ్లు బ్లాక్ చేయకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, కీసర సీఐ అంజనేయులు, జవహర్‌నగర్ సీఐ సైదులు, దమ్మాయిగూడ, నాగారం మున్సిపల్ కమిషనర్లు వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విద్యుత్‌శాఖ ఏఈలు, ఇరిగేషన్, హెచ్‌ఆర్‌డీసీఎల్ అధికారులు, కాలనీ అసోసియేషన్ల సభ్యులు పాల్గొన్నారు.


కీసర రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా


బీఆర్‌ఎస్ నాయకుడు నర్సింలును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కేశంపేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాను బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. ప్రమాదంలో గాయపడిన కార్యకర్తలను పరామర్శించి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. తొమ్మిదిరేకుల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు గోస్కె నర్సింలు, నాగిళ్ల బాలరాజు, లేమామిడి మాజీ ఉప సర్పంచ్ మన్మథరెడ్డి, బషీద్‌లు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. వారిళ్లకు వెళ్లి పరామర్శించారు. కొండారెడ్డిపల్లికి చెందిన బుడుగు బాలయ్య, లేమామిడికి చెందిన వెంకటలక్ష్మమ్మలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఇచ్చారు. కార్యక్రమాల్లో మాజీ వైస్‌ఎంపీపీ సురేందర్, కేశంపేట మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, రాంరెడ్డి, శ్రీశైలంగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రామచందర్, భూపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, నాగరాజు, వెంకటేష్, రామస్వామి, తిరుపతిరెడ్డి, జగన్‌రెడ్డి, ఆంజనేయులు, యాదయ్య, మల్లేశ్, అమరేందర్, తలసాని ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో వసతులు కల్పిస్తా..

నిర్దవెల్లి జెడ్పీ పాఠశాలలో వసతులు కల్పిస్తానని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పాఠశాలను సందర్శించారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు, ఉపాధ్యాయినులు తెలపగా తన సొంత డబ్బుతో వసతులు కల్పిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను సన్మానించారు.

'డబుల్' ఇళ్లలో సమస్యలను వెంటనే పరిష్కరించాలి

శామీర్‌పేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పేదలకిచ్చిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో సమస్యల వెంటనే పరిష్కరించకుంటే సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం అన్నారు. గురువారం సత్యం, నాయకులతో కలసి తూంకుంటలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించి అక్కడ నివాసముంటున్న వారితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఇళ్లలో నెలకొన్న సమస్యలపై పట్ల తూంకుంట మున్సిపల్ అధికారులకు మొరపెట్టుకున్నా పరిష్కరించడం లేదని లబ్ధిదారులు వాపోయారు. సత్యం మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు బస్సు సౌకర్యం లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారని, చెరువు కట్టకు మరమతులు చేయక చెరువు నుంచి కట్ట కింద నీరు లీకై డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వస్తోందని సత్యం అన్నారు. ఇక్కడ ఒక అంగన్‌వాడీ సెంటర్‌ను, ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళల భద్రత దృష్ట్యా పెట్టుకొని పోలీసు పెట్రోలింగ్ చేసి రక్షణ కల్పించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈ నెల 25న మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్న చేపడుతామని పార్టీ జిల్లా సెక్రెటరీ సత్యం హెచ్చరించారు.


లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటున్న సీపీఎం నాయకుడు సత్యం

మహేశ్వరంలో ఘనంగా పోచమ్మ బోనాలు

మహేశ్వరం, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి):మహేశ్వరంలో పోచమ్మ బోనాలు గురువారం ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారికి అభిషేకాలు చేసి నైవేద్యం సమర్పించారు. వేలాదిగా అమ్మవారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పార్టీల నాయకులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. భోనాల ఊరేగింపులో గంగపుత్రుల జాల పందిరి, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువతీ యువకుల కేరింతలు, వీఐపీల సందడితో ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఉత్సవాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డిలు పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ప్రజలు శాంతి యుతంగా ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. అలాగే వినాయక పండగను కూడా ప్రశాంతంగా జరుపుకోవాలని, నిమజ్జన కార్యక్రమాలను పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఉత్సవాలను పర్యవేక్షిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి

విత్తన గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

తాండూరు,ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విత్తన గణపతిని పూజించి పర్యావరణాన్ని కాపాడుదామని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. గురువారం తాండూరు పట్టణం ఎన్ఎస్పీ ట్రస్ట్ కార్యాలయంలో విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేసి మాట్లాడారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ హరిత సేన వ్యవస్థాపకులు జోగినిపల్లి సంతోష్ చేపట్టిన పర్యావరణ పరిరక్షణ కోసం విత్తన గణపతిని పంపిణీ చేశామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించాలని కోరారు. నీటి కాలుష్యం కలుగకుండా విత్తన గణపతిని ప్రతిష్ఠించి నిమజ్జనం రోజు వినాయకుడిని ఇంటి వద్దే నిమజ్జనం చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్‌లు కొట్రిక విజయలక్ష్మి, తాటికొండ స్వప్న, ఎన్ఎస్పీ ట్రస్ట్ చైర్‌పర్సన్ శివాణి, లెక్చరర్లు బసంత్, సోమనాథ్, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ కార్యదర్శి మోహన్‌గౌడ్, రాష్ట్రపతి అవార్డీ గోవింద్‌రావు, ఎన్ఎస్పీ ట్రస్ట్ సభ్యులు భాను, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.


విత్తన గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న శుభప్రద్‌పటేల్

మూసీలో నీటి నిల్వపై ఏకీకృత ప్రణాళిక


మూసీనదిని పరిశీలిస్తున్న ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మూసీనదిలో వరదను నియంత్రిస్తూ నీటి నిల్వకు ఆధునిక పద్ధతులు, పర్యావరణ పునరుద్ధరణ, భద్రతా చర్యలపై ఏకీకృత ప్రణాళికపై ఎంఆర్‌డీసీఎల్ అధికారులు అధ్యయనం చేశారు. ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహారెడ్డి, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులు, కన్సల్టెన్సీ సంస్థల ప్రతినిధులు గురువారం మూసీ పరివాహక ప్రాంతాలను, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాలను సందర్శించారు. మూసీనదిలో నీటి ప్రవాహం, జలాశయాల నుంచి వరద పరిస్థితిపై అంచనా వేశారు. మూసీలో వరద నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ... మూసీనది అభివృద్ధి ప్రాజెక్టులో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. లంగర్‌హౌజ్‌లోని బాపూఘాట్ గాంధీ సరోవర్ వరకు వివిధ ప్రాంతాల్లో ఐకానిక్ టవర్, ఎకో టూరిజం పనులతో సుందరీకరణ పనులకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.



బాధితులతో మాట్లాడుతున్న అనసూయ

నిందితులను జైలుకు పంపాలి

ధారూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నిర్వాహకులపై దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసులుపెట్టి జైలుకు పంపాలని, లేకుంటే ఎస్పీ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు చేపడుతామని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అనసూయ అన్నారు. నాగారంలో దాడికి గురైన భారతమ్మ-అంజి దంపతులు గురువారం ఆమె పరామర్శించి సంఘటనపై వివరాలు తెలుసుకున్నారు. దంపతులపై దాడి చేసి 9 రోజులవుతున్నా నిందితులను పోలీసులు అరెస్టు చేయడం లేదని, నామమాత్ర కేసులు పెట్టి వదిలేయడం అన్యాయం అన్నారు. దాడిచేసిన గంజాయి బ్యాచ్‌తో పోలీసులు కుమ్మక్కయి బాధితులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. నిందితులను జైలుకు పంపకుంటే ఆందోళనలు తీవ్రం చేస్తామని హెచ్చరించారు.



బుగ్గ ఆలయంలో పూజలు చేసిన అక్కమహాదేవి సంఘం మహిళలు

బుగ్గ ఆలయంలో మహిళల పూజలు

వికారాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): శ్రావణాన్ని పురస్కరించుకుని వికారాబాద్ పట్టణ పరిధి బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం వికారాబాద్‌కు చెందిన అక్క మహాదేవి మహిళా సంఘం సభ్యులు ఆలయంలో అభిషేకం, అనంతరం భజన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో చంద్రకళ, విజయలక్ష్మి, గిరిజమ్మ, శోభ, జయమ్మ, నరసమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతీ శిశుమందిరంలో అవధానం చేస్తున్న అనంతప్ప

కళ్లకు గంతలతో అవధానం

తాండూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): తాండూరులోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో గణిత అవధాని రాష్ట్రపతి అవార్డీ కోకట్ అనంతప్ప గురువారం అవధానం నిర్వహించారు. మొదటి అంశంగా మాయ కూడిక, చదవడం విద్యార్థులకు చూపించారు. మెమొరీ శతావధానంలో భాగంగా వంద వివిధ వస్తువులు, జంతువుల పేర్లను బోర్డుపై రాసి విద్యార్థుల కళ్లకు గంతలుకట్టి బోర్డుపై ఉన్న పేర్లను సీరియల్‌గా చెప్పించారు. అనంతప్ప మాట్లాడుతూ.. విద్యార్థులు మేధావులుగా రూపుదిద్దుకోవాలని సూచించారు. హెచ్‌ఎం విజయలక్ష్మి, కార్యదర్శి అనంత్‌రెడ్డి, కోశాధికారి రాంరెడ్డి పాల్గొన్నారు.

ఉరుస్తున్న ఎస్‌బీఐ భవనం

» బషీరాబాద్ బ్రాంచ్‌లో సేవల నిలిపివేత



శిథిలావస్థలో బ్యాంకు లావాదేవీల గది

బషీరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): బషీరాబాద్‌లోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో మూడు రోజులుగా ఖాతాదారులకు సేవలందడంలేదు. భారీ వర్షాలకు బ్యాంకు పురాతన భవనం ఉరిసి కంప్యూటర్లు, రికార్డులు, సామగ్రి తడిసిపోయాయి. కంప్యూటర్లు పనిచేయడం లేదు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సిబ్బంది జంకుతున్నారు. మూడు రోజులుగా బ్యాంకు సేవలను నిలిపేశారు. భవన లీకేజీలపై బ్రాంచ్ మేనేజర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తాండూరు ఎస్‌బీఐ(వ్యవసాయ శాఖ) బ్రాంచ్‌లో అత్యవసర ఆర్థిక సేవలందిస్తున్నట్లు బ్యాంకు ఉద్యోగి చెప్పారు. ఈ విషయం తెలియక ఖాతాదారులు బ్యాంకుకొచ్చి ఉస్సూరుమంటూ తిరిగి వెళ్లిపోతున్నారు. సోమవారం వరకు ఈ బ్రాంచ్‌లో సేవలందించే పరిస్థితి లేదని బ్యాంక్ సిబ్బంది చెబుతున్నారు.



లారీ నుంచి యూరియా తీసుకుంటున్న రైతులు

యూరియా కోసం రైతుల పాట్లు

యాచారం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): కొరత నేపథ్యంలో యూరియా కోసం రైతులు ఎగబడుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు విరామమివ్వడంతో గురువారం యాచారం సొసైటీకొచ్చిన 550 బస్తాల యూరియాను లారీ నుంచి నేరుగా రైతులు పొలాలకు తీసుకెళ్లారు. పట్టా పాస్‌బుక్‌లు తెచ్చి వేలిముద్రలను వేసిన తరువాతే యూరియా ఇస్తున్నారు. మండలంలో పత్తి, మొక్కజొన్న ఇతర పంటలకు వంద టన్నుల యూరియా అవసరమని హాకాకు ఇండెంట్ పెట్టామని సొసైటీ సీఈవో నాగరాజు తెలిపారు. శనివారం మధ్యాహ్నానికల్లా వంద టన్నుల యూరియా వస్తుందని ఆయన చెప్పారు.

మార్కులే కాదు..
పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలి

ఇంటర్మీడియట్ విద్యాశాఖ నోడల్ అధికారి శంకర్‌నాయక్

బొంరాస్‌పేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మార్కులే కాదు.. పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ఇంటర్మీడియట్ విద్యాశాఖ నోడల్ అధికారి శంకర్‌నాయక్ అన్నారు. గురువారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల నిర్వాహణపై ప్రిన్సిపాల్ రోజారాణితో చర్చించారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ చొరవతో కళాశాలకు బెంచీలు, బీరువాలు, కుర్చీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. మండలానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరుకు అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేశారన్నారు. విద్యార్థులు రోజూ కళాశాలకు హాజరై క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. తల్లిదండ్రుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల ఖర్చులపై ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.



రోడ్డుపై నిలిచిన నీటిలో వరినాట్లు వేస్తున్న మహిళలు

రోడ్డు గుంతల్లో నాటేసి నిరసన

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్యజ్యోతి): మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి అజీజ్‌నగర్‌లో భారీ వర్షాలకు రోడ్లన్నీ ధ్వంసమైనా పట్టించుకోనే వారు కరువయ్యారని నాయకులు కొత్త మానిక్‌రెడ్డి. బండ్లగూడ శ్రీధర్ అన్నారు. శ్రీనిధి పాఠశాల నుంచి ఎస్సీ కాలనీ వరకు ఉన్న రోడ్డుపై మోకాళ్లలోతు గుంతలేర్పడ్డాయి. గురువారం ఆ గుంతల్లో వరినాట్లు వేసి నిరసన తెలిపారు. వెంటనే రోడ్డును బాగుచేయాలని డిమాండ్ చేశారు. ఏళ్లుగా రోడ్లకు మరమ్మతులు చేయడం లేదన్నారు. నిరసనలో విజేందర్, అశోక్, మాణిక్యం, గోపాల్, మహిళలు పాల్గొన్నారు.

సామాజిక సంఘ సంస్కర్త జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

» రైతు కుటుంబం నుంచి అత్యున్నత స్థాయికి....

» ఉప రాష్ట్రపతి అభ్యర్థి కావడం సంతోషకరం

» కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్



ఆకులమైలారంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు,ఆగస్టు21(ఆంధ్రజ్యోతి):ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన సామాజిక సంఘ సంస్కర్త బి.సుదర్శన్‌రెడ్డి జిల్లావాసి కావడం సంతోషంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఆకులమైలారం(మాలగూడ) గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ గ్రామానికి చెందిన వ్యక్తి ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేయడానికి నామినేషన్ వేయడం ఆనందంగా ఉందన్నారు. రైతు కుటుంబానికి చెందిన ఆయన సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేసి నేడు సమాజసేవకు తన జీవితాన్ని అంకితం చేయడం హర్షణీయమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఎంపీలు సుదర్శన్‌రెడ్డిని ఇండియా కూటమి అభ్యర్థిగా చూడకుండా సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తిగా చేసిన సేవలను గుర్తించి విజయం కోసం కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఏఎంసీ డైరెక్టర్లు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, ఎ.సురేందర్, మాజీ ఉప సర్పంచ్ జి.రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.



కోట్‌పల్లి: ధ్వంసమైన మోత్కుపల్లి-వికారాబాద్ రోడ్డు



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తల్లారానికి వెళ్లే రోడ్డు

రోడ్లు ఛిద్రం

(ఐదో పేజీ తరువాయి)

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి గుంతలమయంగా మారింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం కూడా ఇదే దారిలో ఉంది. రెండేళ్ల క్రితం గ్రామానికి చెందిన ఓ యువకుడు తన సొంత డబ్బులతో గుంతలు పూడిపించినా పక్కనే గుంతలు ఏర్పడ్డాయి. తల్లారం, దుద్దాగు, రామన్నగూడ, న్యాలట, కుమ్మెర, పామెన, చెనువల్లి, బస్తేపూర్, కౌకుంట్ల, హస్తేపూర్, ఆలూరు నుంచి తంగడపల్లి రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. కందుకూరు మండలంలోని కొలన్‌గూడ నుంచి ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు వరకు నాలుగు కిలోమీటర్ల దూరం వరకు గత 20ఏళ్ల క్రితం బీటీ రోడ్డు వేశారు. ప్రస్తుతం వర్షాలు బీటీ లేచిపోయి ఇబ్బందిగా మారింది. జబ్బార్‌గూడ నుంచి ఇబ్రహీంపట్నం వరకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. హిమాయత్‌నగర్-తంగడపల్లి రోడ్డు గుంతలు పడింది. రెడ్డిపల్లి కల్వర్టుపై రోడ్డు పాడైంది. ఆమనగల్లు మండలం జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండల చంద్రాయన్‌పల్లికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారింది. దీంతో ఈ గ్రామాలకు వెళ్లేందుకు ప్రజలు నకరయాతన పడుతున్నారు. భారీ వర్షాలకు మహేశ్వం-తుమ్మలూరు ప్రధాన రహదారి అడుగుకో గుంత ఏర్పడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.

శంకర్‌పల్లిలో...

శంకర్‌పల్లి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు శంకర్‌పల్లి పట్టణంలో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఇంద్రారెడ్డి చౌరస్తా నుంచి ఫత్తేపురం ఫ్లైఓవర్ వరకు నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణానికి నోచక వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వర్షపు నీరు నిలిచింది. అలాగే శంకర్‌పల్లి చౌరస్తా నుంచి ఫత్తేపురం వరకు కి.మీ పరిధి గల రోడ్డంతా గుంతలుగా మారడంతో నరకాన్ని తలపిస్తున్నది. ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



ఫత్తేపురం రోడ్డు పూర్తిగా పాడవ్వడంతో వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు పడటంతో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. రోడ్డుపైన ఏర్పడిన గుంతలలో నీళ్లు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా రోడ్డు పనులు ప్రారంభించాలి. ప్రజల సమస్యలు పరిష్కరించాలి.

గండిచెర్ల గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌పల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు

ప్రమాదకరంగా ఫత్తేపురం రోడ్డు



శంకర్‌పల్లి చౌరస్తా నుంచి ఫత్తేపురం వరకు నాలుగులేన్ల రోడ్డును వేసి మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేస్తామని అప్పట్లో అధికారులు చెప్పారు. నాలుగేళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు నరకాన్ని తలపిస్తోంది. ఇప్పటికైనా త్వరితగతిన పనులు ప్రారంభించాలి.

బీర్ల సురేష్‌కుమార్, శంకర్‌పల్లి బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు



ఆమనగల్లు: బురదమయంగా జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి రోడ్డు

తాగి పాఠశాలకు..

» రోజూ మద్యం తాగొచ్చి విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ఉపాధ్యాయుడు

» హిమాయత్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో టీచర్ నిర్వాకం

» విధుల నుంచి తొలగించాలని తల్లిదండ్రులు, విద్యార్థుల డిమాండ్



మద్యం మత్తుతో ఆఫీసులో కూర్చున్న హిమన్షహ

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్యజ్యోతి): విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు రోజూ తాగొచ్చి వృత్తికే కళంకం తెస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. మొయినాబాద్ మునిసిపాలిటీ పరిధి హిమాయత్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఎండీ హిమన్షహ పాఠాలు చెప్పడం మాని నిత్యం మద్యం తాగివస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నాడని గ్రామస్తులు అంటున్నారు. గురువారం సదరు టీచర్ విపరీతంగా మద్యంతాగి రావడంతో విద్యార్థులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. వారొచ్చి చూడగా హిమన్షహ మద్యం మత్తులో మాట్లాడలేని స్థితిలో ఉన్నాడు. ఈ తాగుబోతు ఉపాధ్యాయుడిని వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రుల సమాచారంతో ఎంఈవో మల్లయ్య స్కూలుకొచ్చి తల్లిదండ్రులకు నచ్చజెప్పి పంపించారు. శుక్రవారం ఉపాధ్యాయుడి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడుతానని చెప్పారు. ఈ విషయమై ఎంఈవో స్పందిస్తూ.. హిమన్షహ పాఠశాలకు తాగొస్తున్నాడని పలుమార్లు ఫిర్యాదులు రాగా అతడిని హెచ్చరించామని చెప్పారు. అయినా ప్రవర్తనలో మార్పు రావడం లేదన్నారు. అతడిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంఈవో మల్లయ్య వివరించారు.

సమాజ సేవకు కృషి

» బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవికుమార్‌శర్మ

షాద్‌నగర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం కార్యనిర్వాహక కార్యదర్శిగా షాద్‌నగర్ పట్టణానికి చెందిన పూజారి సంబరాజు రవి కుమార్ శర్మ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని బ్రాహ్మణ సేవా సంఘ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనం బ్రాహ్మణ సేవా అనుబంధ సంఘాలను ప్రకటించారు. రవికుమార్ శర్మ షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతి దేవాలయంలో పూజారిగా, పురోహితుడిగా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజ సేవా కార్యక్రమాల్లో తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి అశోక్

ఘట్‌కేసర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి అశోక్ సూచించారు. ఘట్‌కేసర్ 108 వాహనాన్ని గురువారం తనిఖీ చేశారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో ఉన్న వాహనాన్ని పరిశీలించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అంబులెన్స్‌లో అత్యవసర పరికరాలు పనిచేస్తున్నాయా, ఆక్సిజన్‌తో పాటు వివిధ రకాలు పరికరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన అంబులెన్స్ పైలెట్ భద్రునాయక్, ఈఎంటీ రమేష్‌తో మాట్లాడారు. అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలని కోరారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా
ప్రభుత్వ పాలన

» ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



కుర్మిద్దలో యూజీడీ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

యాచారం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు సీఎం రేవంత్ నేతృత్వంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కుర్మిద్దలో రూ.386లక్షలు, తాటిపర్తిలో రూ.641లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు యూరియా సరిపడా అందిస్తున్నట్లు వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. ఫార్మాసిటీ విషయంలో రైతులు ఆందోళన చెందరాదని కోరారు.

ఆదుకోవాలని ఎమ్మెల్యేకు రైతుల వినతి

భూసేకరణ పరిహారం సరిగా అందలేదని మూడెకరాల సాగు భూమి ఉంటే కేవలం ఎకరన్నరకు మాత్రమే ఇచ్చారని, ప్లాట్లు కూడా రాలేదని కుర్మిద్ద గ్రామ రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బి.రాజశేఖర్‌రెడ్డి, డి.రమేష్, ఎం.వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో రాధారాణి, డిప్యూటీ తహసీల్దార్ కీర్తిసాగర్, పంచాయతీ రాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ వంశీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్, మండల వ్యవసాయాధికారి రవినాథ్, ఎంపీవో శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఏడుగురి ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు కేపీహెచ్‌బీ నుంచి ఏడుగురు బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. 17న ఏఎస్‌రావునగర్‌లోని మారుతి బాల్‌బ్యాడ్మింటన్ గ్రౌండ్‌లో జరిగిన పోటీల్లో ఎంపిక చేశామని కేపీహెచ్‌బీ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి మోర్ల రామకృష్ణ తెలిపారు. రమేష్, పెద్దిరెడ్డి, అశోక్‌గౌడ్, అనికేతన్‌కుమార్, దినేష్‌కుమార్, ప్రసన్నకుమార్, అనిల్ ఈ నెల 23, 24 తేదీల్లో ఆదిలాబాద్ జిల్లా గోలేటిలో అంతర్ జిల్లా సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. సెప్టెంబరు 24-28 రాష్ట్రం తరఫున చెన్నైలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ...

మోమిన్‌పేట్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 69వ క్రీడా పోటీల ఎంపిక నిర్వహిస్తామని ఎంఈవో మల్లేశం గురువారం పేర్కొన్నారు. ఈ నెల 22న మోమిన్‌పేట్‌లోని మానవ వనరుల అభివృద్ధి కార్యాలయంలో అండర్-14, 17 విభాగంలో క్రీడా పోటీలకు ఎంపిక నిర్వహిస్తామని తెలిపారు. మోమిన్‌పేట్, మర్పల్లి, బంట్వారం మండలాల బాలబాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ నెల 25న టేకులపల్లి జెడ్పీ పాఠశాలలో కబడ్డీ, 26న పట్లూర్ జెడ్పీ పాఠశాలలో వాలీబాల్ పోటీలకు ఎంపికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవోతో పీడీ వసంత్, పీఈటీలు, కంప్యూటర్ ఆపరేటర్ సుజాత, పద్మారావు, సీఆర్‌పీలు శ్రీనివాస్, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులు యోగాపై దృష్టి సారించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్

మహేశ్వరం, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, పెద్దలు ప్రతి ఒక్కరి దైనందిక జీవితంలో మార్పు తేవడం, అంతర్గత శక్తిని మేలుకొల్పేందుకు స్వాష దోహద పడుతుందని మాజీ మంత్రి టి.దేవేందర్‌గౌడ్ అన్నారు. గురువారం తుక్కుగూడలోని దేవేంద్ర విద్యాలయంలో స్వాష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మనస్సును సమతుల్యం చేయడానికి, శరీరాన్ని శక్తిమంతం చేయడానికి రూపొందించిందే స్వాష అన్నారు. ప్రతీ ఒక్కరు రోజూ గంట యోగాకు కేటాయించాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దేవేంద్ర స్కూల్‌లో విద్యార్థులు స్వాష, యోగ రోజూ అభ్యసించేలా కార్యక్రమాన్ని రూపొందించిన పాఠశాల బోర్డుకు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. పేద విద్యార్థుల కోసం స్థాపించిన దేవేంద్ర విద్యాలయ విద్యార్థులు ప్రపంచం గర్వించేస్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ టి.విజయేందర్‌గౌడ్, కరస్పాండెంట్ టి.శ్వేత, వినయేందర్‌గౌడ్, సేక్రెడ్ పాత్స్ ఫౌండర్ ఉష, ప్రిన్సిపాల్ మాధవిశాస్త్రి, వైస్‌ప్రిన్సిపాల్ ఉషారాణి, ఇక్బాల్ అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెరువు కుంటలకు మరమ్మతులు చేయాలి



చెరువు కట్టను పరిశీలిస్తున్న రాఘవేందర్

కడ్తాల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వర్షాలతో దెబ్బతిన్న చెరువు కుంటలను మరమ్మతు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవలి వర్షాలకు చాలా చెరువు కట్టలు దెబ్బతిని బలహీనం అయ్యాయని తెలిపారు. కడ్తాలలోని దేవర చెరువును గురువారం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. కట్ట పర్రెలీడ్చిందని తెలిపారు. కట్టను వెంటనే బలోపేతం చేయకుంటే తెగుతుందన్నారు. రియల్టర్లు తూము మూసేయడంతో నీరు బయటకు వెళ్లక కట్ట తెగే ప్రమాదం ఉందన్నారు. కోతకు గురికాకుండ అధికారులు చర్యలు చేపట్టాలని రాఘవేందర్ కోరారు. ఆయనతో వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మాధవులు, ఇమ్రాన్‌బాబ, కుమార్‌గౌడ్, మహేశ్, రమేశ్ ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రఘుపాల్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రఘుపాల్, ఉపాధ్యాయులు

కొత్తూర్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రఘుపాల్ డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చాలని ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ ధర్నా చౌక్ వద్ద ఈనెల 23న నిర్వహించే మహాధర్నాకు సంబంధించిన పోస్టర్‌ను పెంజర్ల ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 20నెలలు కావొస్తున్నా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. మహాధర్నాకు ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని రఘుపాల్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు సాయన్న, ప్రిన్స్ శ్రీనివాస్, గౌరయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

● ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

మేడ్చల్ టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కోరారు. డబిల్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉషాట్(వన్ స్కూల్ ఎట్ ఎ టైమ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రూ.90లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు గదుల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఉషాట్ సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షురాలు రజిత మల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రాజమల్లారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అనురాగ్'లో వర్క్‌షాప్


డేటా అనలిటిక్స్ వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో డేటా అనలిటిక్స్ వర్క్‌షాప్ గురువారం ప్రారంభమైంది. అనురాగ్ యూనివర్సిటీ, ఐసీటీ అకాడమి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌తో 15 రోజుల పాటు జరుగనున్న వర్క్‌షాప్‌ను కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ డాక్టర్ విష్ణుమూర్తి, విజయ్‌కుమార్, ఐటీసీ సంస్థ స్టేట్ హెడ్ గోపాల్‌లు వర్క్‌షాప్‌ను ప్రారంభించి సీఎస్‌సీలో 67 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెగా కాంట్రాక్టర్ ఈవెంట్


వికారాబాద్‌లో నిర్వహించిన మెగా కాంట్రాక్టర్ ఈవెంట్

వికారాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా మెగా కాంట్రాక్టర్ ఈవెంట్ విజయవంతంగా నిర్వహించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన ఈవెంట్‌లో ఆధునిక నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించి, డీలర్లు కాంట్రాక్టర్లు, డిస్ట్రిబ్యూటర్ల మధ్య సాంకేతిక పరిజ్ఞానంపై చర్చలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎండీ.ఖానీవ్‌అలీ, ఎండీ, తస్వీర్‌అలీ, ఎండీ రియాజ్‌అలీ, శ్రీకృష్ణన్ ఉన్ని, మధుకర్, శివశంకర్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ యాదగిరి

తాండూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపల్ కమిషనర్‌గా గురువారం యాదగిరి బాధ్యతలు చేపట్టారు. వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న యాదగిరి రెగ్యులర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు హైదరాబాద్‌లో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం తాండూరుకు వచ్చి అధికారులు, సిబ్బందితో పరిచయం చేసుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన కమిషనర్

తాండూరు నూతన మున్సిపల్ కమిషనర్‌గా నియమితులైన యాదగిరి గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. తాండూరు మున్సిపాలిటీలో అవినీతి అక్రమాలు లేకుండా తాండూరు పట్టణ అభివృద్ధి కోసం పని చేయాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు.

అన్నారంలో అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ


ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

కొడంగల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అన్నారంలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. మురుగునీరు వెళ్లేందుకు సైడ్ డ్రైనేజీలు లేక ఇళ్లనుంచి వస్తున్న మురుగు కుంటలా మారి పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. దీనికి తోడు కాలనీలో సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

దుద్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ నారాయణరెడ్డి, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం మండలంలోని చెట్టుపల్లి తండా కేజీబీవీ పాఠశాలలో పరిగి సబ్‌డివిజన్ షీటీం ఇన్‌చార్జి నర్సింహులు, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాధిక, పోలీసు కళాబృందం సభ్యులు అశోక్, శంకర్, అమృత పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ

దుద్యాల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విద్రోహ దినం సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని పీఆర్టీయూ నాయకులు పిలుపునిచ్చారు. హకీంపేట్ జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో గురువారం ఉపాధ్యాయులతో కలిసి మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరేందర్, జిల్లా కార్యదర్శి అమర్‌నాథ్, రవికుమార్, వేణుగోపాల్, తిరుమలేశ్, వెంకటేశ్, కరుణాకర్ పాల్గొన్నారు.

నాపరాళ్ల తవ్వకాలు నిలిపివేయాలి

బషీరాబాద్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నాపరాళ్ల తవ్వకాలను నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జీవన్గికి చెందిన రత్నప్ప తహసీల్దార్ షాహీదాబేగంకు గురువారం ఫిర్యాదు చేశాడు. శివారులోని సర్వే నంబర్ 297లో తమ కుటుంబంతో పాటు మరి కొందరికి పట్టా భూములు ఉన్నాయన్నారు. ఆయా భూముల్లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇదెక్కడి చోద్యం!

● బిల్లులు రాలేదని పిల్లలకు నో ఎంట్రీ
● అంగన్‌వాడీ వద్ద మాజీ సర్పంచ్ అడ్డగింత
● మరో అంగన్‌వాడీ కేంద్రంలోకి రానివ్వని టీచర్


మేడికొండ గ్రామంలో మాజీ సర్పంచ్ నిర్మించిన కొత్త భవనం

పూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కొత్త భవనం నిర్మించిన మాజీ సర్పంచ్ చిన్నారులను అడుగు పెట్టనివ్వడం లేదు.. పోని మరో భవనంలో అయినా కేంద్రాన్ని కొనసాగిద్దామంటే ఆ కేంద్రం టీచర్ తమ కేంద్రంలో ఎలా పంపిస్తారంటూ అడ్డుకుంది. ఇదిచూసిన జనం ఇదెక్కడి చోద్యమంటూ ఆశ్చర్యపోయారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని మేడికొండలో అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరడంతో గత ప్రభుత్వం ఎంపీపీ నిధులతో కొత్త భవన నిర్మాణానికి రూ.5లక్షల నిధులను మంజూరు చేసింది. ఇట్టి నిధులతో అప్పటి స్థానిక సర్పంచ్ అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించాడు. కానీ ఆయన ఒక గది కాకుండా రెండు గదులు నిర్మించారు. అయితే గురువారం అంగన్‌వాడీ చిన్నారులను కొత్త భవనంలోకి తీసుకెళుతుండగా, మాజీ సర్పంచ్ అడ్డుకుని భవన నిర్మాణానికి మొత్తం రూ.20లక్షలు ఖర్చు పెట్టానని, రూ.20లక్షలు తనకు చెల్లించిన తర్వాతే కేంద్రాన్ని కొనసాగించాలని అడ్డుకున్నాడు. దీంతో ఎంఈవో సాయిరెడ్డి గ్రామస్తులతో మాట్లాడారు. అయితే గత ఐదేళ్ల క్రితం నిర్మించి వదిలేసిన అంగన్‌వాడీ భవనం ఉందని, అక్కడే కేంద్రాన్ని కొనసాగించాలని గ్రామస్తులు ఎంఈవోకు తెలిపారు. ఎంఈవో, గ్రామస్తులు పాత అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చూడగా విద్యార్థులు లేక చెత్తా చెదారం, ముళ్లపొదలతో నిండి ఉంది. దీంతో గ్రామస్తుల సహకారంతో భవనాన్ని, ముళ్లపొదలను తొలగించి శుభ్రం చేయించారు. తీరా అక్కడికి వచ్చిన అట్టి అంగన్‌వాడీ కేంద్రం టీచర్ పిల్లలను రానివ్వకుండా అడ్డుకుంది. అటు మాజీ సర్పంచ్, ఇటు అంగన్‌వాడీ టీచర్ నిర్వాకంతో గ్రామస్తులు, ఎంఈవోకు తలనొప్పిగా మారింది. దీంతో పక్కనే ఉన్న ఓ షెడ్డులో చిన్నారులను కూర్చోబెట్టి రోజు గడిపారు. ఇదిలా ఉండగా, రాకంచర్లలో ఉన్న ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో అక్కడకూడా నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం వద్దే ప్రాథమిక, అంగన్‌వాడీ విద్యార్థులు ఒకేచోట కూర్చోబెట్టారు.

విద్యార్థులు విలువలు పాటించాలి


మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

మేడ్చల్‌టౌన్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విలువలు పాటించి విజ్ఞానంతో సమాజానికి సేవ చేయాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మేడ్చల్ మున్సిపాలిటీ, కిష్టాపూర్ మల్లారెడ్డి కళాశాలలో గురువారం జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మన చదువును సమాజం మంచికోసం ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, కార్యదర్శి కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు సుబ్బరత్నం, భరతసింహ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో క్రాంతి కీన్ విద్యార్థుల ప్రతిభ

కీసర రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో దమ్మాయిగూడ క్రాంతి కీన్ అకాడమి విద్యార్థులు సత్తాచాటారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు నూతనంగా నవోదయ పాఠశాలను అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ పాఠశాలో తొలి విడతగా 40మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. అందులో 19మంది క్రాంతి కీన్ అకాడమి విద్యార్థులు ఉన్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో సెక్రటరీ లావణ్య, డైరెక్టర్ పీఎస్‌ఆర్ క్రాంతి, ప్రిన్స్‌పల్ కళ్యాణి, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పల్లె మురిసేలా..

(ఐదో పేజీ తరువాయి)

అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు, స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా నిర్మించనున్న ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, సాగ్రిగేషన్ షెడ్లు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా గ్రామీణ రహదారుల నిర్మాణం నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇప్పటికే పూర్తయిన గ్రామ పంచాయతీ, అంగన్వాడీ భవనాలు, గ్రామీణ రహదారులు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఇందిరా మహిళా శక్తి - ఉపాధి భరోసా కింద చేపట్టే పలు జీవనోపాధి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నారు. వ్యక్తిగత ఆస్తుల కల్పన లక్ష్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు పశువుల పాకలు, కోళ్ల షెడ్లు, గొర్రెల షెడ్లు, ఎరువుల తయారీ, అజోలా పిట్ల నిర్మాణం వంటి పనులు చేపడతారు. ప్రతి గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత లబ్ధిదారులకు సంబంధించి కనీసం ఒక పనికైనా శుక్రవారం శంకుస్థాపన చేయించాలన్న లక్ష్యంతో అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

నిధులు, పనుల వివరాలు

ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా రూ.23.13 కోట్లతో 1,363 పనులు చేపట్టేవిధంగా కార్యాచరణ రూపొందించారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా రూ.12.28 కోట్లతో కొత్తగా గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలను నిర్మించనున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సెగ్రిగేషన్, కమ్యూనిటీ మరుగుదొడ్లు, గ్రామీణ రహదారులను నిర్మించనున్నారు. ఇందిరా మహిళా శక్తి భరోసా కింద పలు జీవనోపాధి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. వ్యక్తిగత ఆస్తుల కల్పనకు పశువుల పాకలు, కోళ్ల ఫారాలు, ఇంకుడుగుంతలు, చెక్‌డ్యాంలు, నాడెపు కంపోస్ట్ పిట్స్, అజోలా షెడ్ల నిర్మాణాల వంటి 1,274 పనులను రూ.10.85 కోట్లతో చేపట్టనున్నారు. రూ.8.60 కోట్లతో 43 గ్రామ పంచాయతీలు, రూ.3.68 కోట్లతో 46 అంగన్వాడీ భవనాలు, రూ.6.15 కోట్లతో 648 పశువుల పాకలు, రూ.7.99 కోట్లతో 94 మేకల పాకలు, రూ.7.39 కోట్లతో 62 కోళ్ల ఫారాల నిర్మాణం చేపట్టనున్నారు. రూ.6.75 లక్షలతో 45 అజోలా షెడ్ల నిర్మాణం, రూ.4 కోట్లతో 160 వర్మీ, నాపెడ్ కంపోస్ట్ పిట్స్, రూ.2.55 కోట్లతో 51 చెక్‌డ్యాం పనులు, రూ.1.39 కోట్లతో 214 ఇంకుడుగుంతల నిర్మాణం పనులు చేపట్టాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది.

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

● తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తాండూరు డీఎస్పీ

పెద్దేముల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): మత్తుపదార్థాలకు ఎవరు బానిసలు కావొద్దని ని తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి అన్నారు. గొట్లపల్లి సమీపంలోని మోడల్‌స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. ఎవరైనా డ్రగ్స్ వాడినా, విక్రయాలు చేస్తున్నా వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని చెప్పారు. సమాచారం ఇచ్చినవారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే రోడ్డుభద్రత, డ్రంకెన్‌డ్రైవ్, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు, మహిళలపై జరుగుతున్న నేరాలగురించి అవగాహన కల్పించారు. ఎవరూ చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడకూడదని చెప్పారు. అలాంటి వారిని చట్టరీత్యా శిక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ వేణుకుమార్, ఏఎస్‌ఐ షీటీం తాండూరు సబ్‌డివిజన్ ఇన్‌చార్జి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డాక్టరేట్ రావడం అభినందనీయం


డాక్టరేట్‌లను అందుకున్న అధ్యాపకులు

శామీర్‌పేట, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వివిధ విభాగాల్లో పరిశోధనలు చేసినందుకుగాను గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు అధ్యాపకులు డాక్టరేట్ పొందడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ అన్నారు. డాక్టరేట్ పొందిన ఐదుగురు మహిళా అధ్యాపకులను గురువారం శామీర్‌పేటలోని ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు. అధ్యాపకులు డాక్టర్ స్రవంతి(తెలుగు పండిత్), డాక్టర్ కీర్తి(జువాలజీ), డాక్టర్ అనిత(కెమిస్ట్రి), డాక్టర్ లక్ష్మీప్రసన్(స్టాటస్టిక్స్), డాక్టర్ హైమావతి(ఫిజికల్ ఎజికేషన్) విభాగాల్లో ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయు) డాక్టరేట్ అవార్డులను సాధించారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. వీరు రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణన్, వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్‌ల చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాలను అందుకున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న చిన్నికృష్ణులు


శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో విద్యార్థులు

ధారూరు, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): ధారూరులోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు శ్రీకృష్ణుని, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల విద్యార్థులతో గురువారం ఊరేగింపు నిర్వహించారు. కోలాటంతో ఆడుతూ, పాడుతూ, ఉట్టిలు కొడుతూ గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

సంక్షిప్తంగా..

పెంటకుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలి

బషీరాబాద్: ఎక్మాయి గ్రామం ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల వద్ద పెంటకుప్పల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని స్థానిక యువకులు గురువారం బషీరాబాద్ ఎంపీడీవో తిరుమలస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాశీనాథ్, సాయిరెడ్డి, నర్సింహులు, కమాల్, విజయ్‌కుమార్ తదితరులున్నారు.

ప్రైమ్ ల్యాండ్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జగన్‌మోహన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లోని ప్రైమ్‌ల్యాండ్ కాలనీ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం సాయంత్రం ప్రైమ్ ల్యాండ్ కాలనీలోని గణపతి ఆలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొమ్మిడి జగన్ మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సాల్వేరు రాజేష్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి, నందు, రమేశ్, అనిల్ కుమార్, కోశాధికారిగా సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా రాధాకృష్ణ, హరికృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.శ్రీధర్, కార్యవర్గ సభ్యులుగా విజయ్ కుమార్, రవీందర్ ఎన్నికయ్యారు.

మురుగు తొలగింపునకు చర్యలు

పరిగి: ఇటీవల కురిసిన వర్షాల నేపథ్యంలో పేరుకుపోయిన మురుగు తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు పరిగి మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. పరిగి వ్యవసాయ మార్కెట్‌యార్డులో పేరుకుపోయిన మురికిని గురువారం జేసీబీలతో శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు జగన్నాథ్‌రెడ్డి, దశరథం తదితరులు పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

దుద్యాల: మండలంలోని హస్నాబాద్ గ్రామ సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ పగిలిపోయింది. పైపులైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం హస్నాబాద్, ఆలేడ్ గ్రామాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణి తెలిపారు.

నేడు అంగన్‌వాడీ భవనాలకు శంకుస్థాపన

బొంరాస్‌పేట్: మండలంలోని సూర్యనాయక్, టేకులగడ్డ, గట్టిగానితండా, సాలిండాపూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన శుక్రవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీవో వెంకన్‌గౌడ్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పెసర దిగుబడిపై అంచనా


పెసర పంటను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రావు

దోమ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్, గంజిపల్లి గ్రామాల్లో గురువారం పెసర పంట దిగుబడిని ఎన్‌ఎస్‌ఎస్‌వో జాతీయ గణాంకాల అధికారి ఆర్.ప్రభాకర్‌రావు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు చెన్నకేశవులు, అనంతయ్య, వెంకటయ్య సాగు చేసిన పెసర పంటలను పరిశీలించి దిగుబడిని అంచనా వేశారు. పంట దిగుబడికి నాణ్యమైన విత్తనాలను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల గణాంకాల అధికారి సందీప్‌రెడ్డి, ఏఈవో బాబ్యనాయక్, తదితరులు ఉన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్


వీధి కుక్కల క్యాచింగ్ టీంతో రాజేష్, తదితరులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేయించనున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ కమిషనర్ పంజాల రాజేష్ తెలిపారు. ఎదులాబాద్‌లో గురువారం ఇన్ఫోసిస్ సౌజన్యంతో వీధికుక్కలకు వ్యాక్సినేషన్ చేయించారు. మున్సిపాలిటీ పరిధిలోని అవుశాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, మాధారం, ఘనాపూర్‌లల్లో వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేయడానికి బ్లూక్రాస్ హైదరాబాద్ వారికి అప్పగించనున్నారు. ముందుగా ఎదులాబాద్‌లో 50 వీధికుక్కలను పట్టుకోని వ్యాక్సినేషన్ వేయడానికి బ్లూక్రాస్‌కు అప్పగించామన్నారు. వీధికుక్కల బారినపడి జనాలు ఇబ్బందులు పడకూడదనే వ్యాక్సినేషన్ వేయిస్తున్నట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బ్లూక్రాస్ హైదరాబాద్ సీవోవో యుఎస్‌కే కుమారి, జిల్లా జంతు సంక్షేమ బోర్డు సభ్యురాలు ప్రవళిక, ఇన్ఫోసిస్ సంస్థ ప్రతినిధి వంశీ, శశికాంత్, ఆదిత్య పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

ఘట్‌కేసర్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో గల పోచమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ కౌన్సిలర్ సర్వీ రవీందర్‌గౌడ్ రూ.1.4లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అలయ కమిటీ అధ్యక్షుడు పల్లె బిక్షపతి, అశోక్, శ్రీనివాస్, శశాంక్, ప్రవీణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

కులకచర్ల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని బీజేపీ మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ అన్నారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం 112 మంది విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో హబీబ్ అహ్మద్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు రమేశ్, మహిపాల్, సీహెచ్ చంద్రలింగం, ఆంజనేయులు, మహేశ్‌నాయక్, ప్రవీణ్, లక్ష్మయ్య, శేఖర్, శైలజ పాల్గొన్నారు.

అర్థమయ్యే విధంగా బోధించాలి

దోమ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని జీహెచ్‌ఎం లాల్యానాయక్ సూచించారు. మండలంలోని బుద్లాపూర్, కిష్టాపూర్ పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. 4వ తరగతి విద్యార్థులతో చదివించి సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ, లక్ష్మణ్, భీమ్లా, సువర్ణ, మధు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 78మందికి జరిమానా

● ఇద్దరికి జైలు శిక్ష


మద్యం సేవించి వాహనాలు నడిపిన ఇరువురిని జైలుకు తరలిస్తున్న పోలీసులు

తాండూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 78మందికి జరిమానాలు, ఇద్దరికి జైలుశిక్ష విధిస్తూ వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హర్ష చౌదరి గురువారం తీర్పు చెప్పినట్లు తాండూరు పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన మంబాపూర్‌కు చెందిన స్టాలిన్‌కు మూడు రోజులు జైలు శిక్షతో పాటు రూ.3వేలు జరిమానా, ఎల్మకన్నెకు చెందిన శ్రీనివాస్‌కు రెండు రోజులు జైలు శిక్షతో పాటు రూ.3వేలు విధించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన మరో 78మందికి రూ.లక్షా 14వేలు జరిమానా విధించారని తెలిపారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

తాండూరు రూరల్ పరిధిలో 44మందిపై కేసులు

తాండూరు రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేసిన తాండూరు రూరల్ సీఐ నగేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండల పరిధిలో గతంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 44మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అట్టి వ్యక్తులను గురువారం అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, తాండూరు సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచినట్లు తెలిపారు. కరన్‌కోట్ పోలీసు స్టేషన్ పరిధిలో 12కేసులకు గాను రూ.23వేలు, బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో 15కేసులకు గాను రూ.21వేల 500లు, యాలాల పోలీసు స్టేషన్ పరిధిలో 17 మందికి గాను రూ.28వేల 500లు మొత్తం 44మందికి రూ.73వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపటం నేరమని, అలాచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవాబుపేట, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని సిద్దిపేట-వికారాబాద్ రైల్వే స్టేషన్‌ల మార్గమధ్యంలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 50 సంవత్సరాలు వయసు కలిగిన ఓగుర్తు తెలియని వ్యక్తిమృతదేహం రైలు ఢీకొని మృతిచెందాడు. మృతుడి షర్ట్‌పై సుప్రీం టైలర్ అని రాసి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

బషీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓవ్యక్తి గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బషీరాబాద్ ఎస్‌ఐ నుమాన్‌అలీ గురువారం తెలిపారు. గొట్టిగకలాన్ గ్రామానికి చెందిన ఎండీ ఖైమూద్(40) నవాల్గ సమీపంలోని ఓ గిరిజన తండాకు కూలీల కోసం ఈనెల 19న వెళ్లాడు. ఈక్రమంలో అదేరోజు మధ్యాహ్నం తిరిగి వస్తుండగా నవాల్గ నల్లచెరువు సమీపంలోని లో-లెవల్ బ్రిడ్జి సమీపంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ఖైమూద్‌ను తాండూరు జిల్లా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిఎందినట్లు కుటుంబీకులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుట్కాలు తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

పరిగి, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): గుట్కాలు తరలిస్తున్న కంటైనర్‌ను గురువారం పరిగి పోలీసులు పట్టుకున్నారు. పరిగిలోని సాయిబాబాకాలనీ నుంచి అనుమానాస్పదంగా వస్తున్న డీసీఎంను పరిగిలో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. కంటైనర్‌లో భారీగా నిషేధిత గుట్కాలు ప్రాథమికంగా ఉన్నట్లు గుర్తించారు. అయితే కంటైనర్‌ను డ్రైవర్ వదిలేసి పరారీలో ఉండగా కంటైనర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. లక్షలు విలువ చేసే నిషేధిత గుట్కాలు ఉన్నట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం పట్టుబడిన కంటైనర్ గురించి గోప్యతను ప్రదర్శించడంతో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కేఏ01 ఏకే 7092 నంబరు గల కంటైనర్ పట్టుకున్నది వాస్తవమేనని, అందులో ఏం ఉందో ఇంకా తెలియదని ఎస్‌ఐ మోహనకృష్ణ తెలిపారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

బషీరాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్)తో పోగొట్టుకున్న ఫోన్‌లను పోలీసులు ఇట్టే పట్టేస్తున్నారు. బషీరాబాద్‌కు చెందిన ఎండీ.మస్తాన్ ఇటీవల తన ఫోన్ పోగొట్టుకున్నారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పోలీసులు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌తో ట్రేస్ చేసి పోగొట్టుకున్న ఫోన్‌ను వెతికి పట్టుకున్నారు. ఆ ఫోన్‌ను గురువారం సాయంత్రం బాధిత వ్యక్తికి ఎస్‌ఐ నుమాన్‌అలీ పోలీస్‌స్టేషన్‌లో స్వయంగా అందజేశారు.

అక్రమ మైనింగ్ కేసులో విచారణకు మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డి

పూడూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసులో దోమ మాజీ జెడ్పీటీసీని పోలీసులు విచారణకు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. దోమకు చెందిన మాజీ జెడ్పీటీసీ నాగిరెడ్డిపై అక్రమ మైనింగ్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో పూడూరు మండలం చెన్‌గోముల్ పోలీసులు గురువారం అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు అక్రమ మైనింగ్ కేసు విషయమై నాగిరెడ్డిని విచారణ జరుపనున్నట్లు ఎస్‌ఐ భరత్‌కుమార్ తెలిపారు.

విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చేయాలి

తాండూరు, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర మహాసభల్లో ఆమెమాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న జిల్లా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. తాండూరులోని సీసీఐ కర్మాగారంను ప్రైవేటు పరం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. సిమెంట్, సుద్ద కర్మాగారాల్లో, నాపరాతి, పాలిషింగ్ యూనిట్లలో పని చేస్తున్న కార్మికులకు వెంటనే ఈఎస్‌ఐ ఆస్పత్రి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

కొడంగల్ రూరల్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నిర్వాహకులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనుమతి పత్రాన్ని ఒకటి పోలీస్‌స్టేషన్‌లో అందించాలని మరొక పత్రాన్ని మండపం వద్ద ఉంచుకోవాలని సూచించారు.